నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 16 మే 2024 SANGAREDDY



చిలిపిచెడ్: చిట్కుల్‌లో మెదక్-సంగారెడ్డి రహదారిపై తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించాలని రాస్తారోకో చేస్తున్న రైతులు



హుస్నాబాద్ మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రంలో వడ్లను తూకం వేస్తున్న హమాలీలు

## ధాన్యం బస్తాలు తరలించాలని రైతుల నిరసన

చిలిపిచెడ్, మే 15 : మండలంలోని చిట్కుల్‌లో తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించాలని రైతు లు బుధవారం రాస్తారోకో, నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని, బస్తా కు మూడు కిలోల తరుగు తీయడాన్ని నిరసిస్తూ మెదక్-సంగారెడ్డి రహదారిపై రైతులు పెద్దఎత్తున రాస్తారోకోకు దిగారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సోమక్కపేట పీఏసీఎస్ సిబ్బంది అక్కడకు చేరుకొని సివిల్ సప్లయ్ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి రైతులను సముదాయించారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించే వరకు రోడ్డుపై నుంచి జరిగేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. వద్దురా నాయన కాంగ్రెస్ పాలన..సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ రైతులు నినాదాలు చేశారు. డీఎం ఫోన్‌లో మాట్లాడి తూకం వేసిన ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. రాస్తారోకోలో రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వేతనం కోసం ఆందోళన

- ట్రైడెంట్ చక్కెర పరిశ్రమలో పొగ గొట్టమెక్కి కార్మికుడి హల్‌చల్
- పరిశ్రమ ఎదుట కార్మికుల నిరసన



కొత్తూర్ ట్రైడెంట్ పరిశ్రమలో పొగ గొట్టమెక్కి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికుడు రమేశ్



పరిశ్రమ వద్ద కార్మికుల ఆందోళన

కోహీర్, మే15: ట్రైడెంట్ చక్కెర పరిశ్రమ యాజమాన్యం సంవత్సరం గడిచినా వేతనాలు చెల్లించడం లేదని కార్మికుడు హల్‌చల్ చేశాడు. బుధవారం జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామ ట్రైడెంట్ చక్కెర పరిశ్రమ కార్మికుడు రమేశ్‌బాబు పరిశ్రమ ఆవరణలో ఉన్న పొగ గొట్ట మెక్కి నిరసన వ్యక్తం చేశాడు. గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు వేతనం చెల్లించలేదని పరిశ్రమ యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. చేతిలో డబ్బులు లేకుండా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు వెంటనే పరిశ్రమను ప్రారంభించాలని కోరాడు. పరిశ్రమ నడువకపోవడంతో కార్మికులంతా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశ్రమకు రావడం, పోవడానికి మాత్రం ఖర్చులు భరించాల్సి వస్తున్నదని, అధికారులు కూడా తమను సతాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పరిశ్రమను ప్రారంభించి ఇక్కడి చెరుకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. చక్కెర పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని, తమ సమస్యలు పరిష్కరించకుంటే ధర్నా నిర్వహిస్తామని కార్మికులందరూ స్పష్టం చేశారు. జహీరాబాద్ పట్టణ సీఐ రవి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రమేశ్ బాబుతోపాటు పరిశ్రమలో విధులు నిర్వహించే మరో కార్మికుడి ఇంట్లో వివాహాలు ఉండడంతో వెంటనే రూ.2లక్షల చొప్పున మంజూరు చేయిస్తామని కార్మిక శాఖ అధికారులు, స్థానిక నేతలు చెప్పడంతో పొగ గొట్టంపై నుంచి కిందకు దిగాడు. వచ్చే బుధవారం పరిశ్రమ ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో చర్చలు నిర్వహించి కార్మికులకు న్యాయం చేస్తామన్నారు.

## ఉపాధి కల్పించి ఆదుకోండి

- కుటుంబ పెద్ద ఆత్మహత్యతో కష్టతరంగా జీవనం
- ఇద్దరు పిల్లలతో అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్న ఇల్లాలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

గజ్వేల్, మే 15: సాగు కోసం చేసిన అప్పుల కుతోడు తరుచూ కాలిపోతున్న బోరు మోటరును రిపేర్ చేయించే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తూ గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్‌కు చెందిన రైతు చిగురుస్వామి(36) ఫిబ్రవరిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పెద్దదిక్కు మృతితో ఆ కుటుంబ జీవన పరిస్థితిని చూసిన వారంత అయ్యో పాపం అంటున్నారు. ఇప్పుడు ఆ కుటుంబం సాయం కోసం ఎదురుచూస్తున్నది. ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నది. బంగ్లావెంకటాపూర్ గ్రామానికి చెందిన చిగురుస్వామి తనకున్న ఎకరం వ్యవసాయ పొలంలో 30 గుంటల్లో వరి సాగు చేశాడు. సాగు కోసం చేసిన అప్పులు అధికమవడంతోపాటు సాగు చేసిన పంట ఎండిపోవడంతో ఆశించిన దిగుబడి రాదనే బెంగతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోరు మోటరు కాలిపోయిన సమయంలో రిపేర్ చేయడానికి సుమారుగా రూ.10వేల ఖర్చవుతుంది. రోజురోజుకూ సమస్యలు అధికమవడంతో కలత చెందిన స్వామి భార్య స్రవంతికి పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి వ్యవసాయ పొలం సమీపంలోనే చెరువు కట్టపై చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరేండ్లలోపు వంశీ, శన్విశేష్ ఇద్దరు కొడుకులున్న విషయాన్ని మర్చి ఆత్మహత్యకు పాల్పడడంతో అప్పుల భారం భార్య స్రవంతికి తలకుమించిన భారంగా మారి బతకడమే కష్టమవుతున్నది.

**ఉపాధి చూపించండి**

చిగురుస్వామి భార్య స్రవంతి సొంతూరు వర్గల్ మండలం అనంతగిరిపల్లి. ఉన్నత పాఠశాల దశలోనే సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభను చూపించింది. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సిద్దిపేట జిల్లా జట్టు తరపున ఆడగా మూడో స్థానంలో నిలవడంతో ఆమెను పీఈటీలు అభినందించారు. చిన్న వయస్సులోనే పెండ్లి చేయడంతో మధ్యలోనే చదువు మానేసి భర్తకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంది. నా అనే వాళ్లు లేరు.. ఇద్దరు పిల్లలతో ఎలా బతికేది. రూ.ఐదారు లక్షల అప్పులు ఎలా తీర్చాలే అంటూ కంట తడిపెట్టింది. బోరు కాలిపోయినప్పుడు డబ్బులు లేక బాగు చేయించకపోతే పొలం ఎండిపోయింది. ఇద్దరు పిల్లలతో జీవనం సాగించడం కష్టంగా మారిందని, క్రీడా రంగంలో ప్రతిభ ఉన్న తనకు అదేరంగంలో ఉపాధి చూపించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.



భర్త ఫొటోతో భార్య స్రవంతి, కొడుకులు వంశీ, శన్విశేష్

## నేల చల్లబడ్డాక సాగు చేయాలి

- తొలకరి చినుకులకే నాటి రైతులు నష్టపోవద్దు
- రెండు మూడు వర్షాలు పడే వరకు ఆగాలి
- రైతు అవగాహన సదస్సులో ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 15: రెండు మూడు వర్షాలు పడి నేల చల్లబడ్డాక సాగుకు ఉపక్రమించాలని తొలకరి చినుకులనే విత్తనాలు నాటి నష్టపోవద్దని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉపసంచాలకులు(ఏడీఆర్) డా. మల్లారెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమకు సమీపంలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహా తీసుకొని సాగుకు ఉపక్రమించాలని చెప్పారు. సమతుల్య వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సూచనలు చేశారు. వానకాలం సాగులో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమతుల్య సాగు అవసరమని తెలిపారు. నీటి సాంకేతికతకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుక్కునేటప్పుడు అధికారులతో సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత గల డీలర్‌తో లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులతో కొనుగోలు చేయాలని చెప్పారు. తప్పనిసరిగా రసీదు పొంది పంట చివరి వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. మూస పద్ధతిన సాగు చేస్తే అపార నష్టాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు ప్రేమ్ సింగ్, శేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం సంచాలకులు డా.అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఉద్యాన పంటలు కూరగాయలు, పూలతోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకుల వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి




# నష్టాలను మిగిల్చిన యాసంగి

### దిగుబడులు తగ్గి నష్టపోయిన మెట్ట రైతులు



హుస్నాబాద్ మండలం కూచనపల్లి శివారులో ఎండిపోయిన వరి పంటను చూపుతున్న రైతులు

అక్కన్నపేట మండలంలో..

- ఈ ఏడాది సగానికి సగానికి పడిపోయిన దిగుబడులు
- వెలవెలబోతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 2022-23 యాసంగిలో 2,73,339 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు
- ఈ సారి యాసంగిలో 1,25,878 క్వింటాళ్ల కొనుగోళ్లు
- సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడకపోవడం, సాగునీటి ఎద్దడి ప్రధాన కారణం
- గౌరవెల్లి రిజర్వాయర్‌పైనే మెట్ట రైతుల కోటి ఆశలు
- బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకున్నా...నిండా ముంచిన కాంగ్రెస్ సర్కార్
- తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా చితికిపోయిన కర్షకులు
- వచ్చే యాసంగి వరకైనా నీళ్లందుతాయో లేదోనని ఆందోళన

హుస్నాబాద్, మే 15: యాసంగి పంట మెట్ట రైతులను నిండా ముంచింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది యాసంగి పంట దిగుబడులు సగానికి సగం పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో గడిచిన పదేండ్లు ఎలాంటి అవాంతరాలు లేకుండా యాసంగి పంటలు పండించుకొని ఎలాంటి నష్టాలు లేకుండా జీవనం సాగించిన రైతులు ఈ ఏడాది యాసంగిలో తీవ్రంగా నష్టపోయారు. 2022-23 సంవత్సరంలో సాగునీరు అందుబాటులో ఉండటం, సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు మంచి దిగుబడులు రావడంతోపాటు పండిన పంటను మద్దతు ధరకు అమ్ముకున్నారు. కానీ ఈ ఏడాది యాసంగిలో సాగునీటి ఎద్దడి వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గడం, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. సాగు చేసిన పంట సగానికిపైగా ఎండిపోవడంతో రైతన్న విలవిలలాడాడు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తక్కువ ధరకే వడ్లను రైస్ మిల్లర్లకు అమ్మాల్సి వచ్చింది. మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయినప్పటికీ అందులో నీళ్లు నింపకుండా కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి మోటర్లు, పంపులు నడువకుం డా అడ్డుకున్నారు. కనీసం రిజర్వాయర్‌లో నీళ్లుంటే భూగర్భ జలాలు పెరిగి యాసంగి పంట చేతికొచ్చేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలైనా రిజర్వాయర్‌లో నీళ్లు నింపే పనులు గానీ, కాల్వలు తవ్వే పనులపై గానీ దృష్టి సారించక పోవడంపై రైతన్నలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే యాసంగి వరకైనా నీళ్లందుతాయో లేదోననే ఆందోళనలో కర్షకులు ఉన్నారు.

### తగ్గిన యాసంగి కొనుగోళ్లు

హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఐకేపీ, ప్యాక్స్‌ల ద్వారా 2022-23 యాసంగిలో 2,73,339 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా 2023-24 యాసంగిలో కేవలం 1,25,878 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. అంటే గతేడాదికి ఈ యేడాదికి ధాన్యం దిగుబడి ఎంత తగ్గిందో తెలుస్తుంది. గతేడాది ఐకేపీ ద్వారా 82,888 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే ఈ ఏడాది కేవలం 30,839 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. పీఏసీఎస్ ద్వారా గతేడాది 1,90,451 క్వింటాళ్ల ధాన్యం కొంటే ఈ ఏడాది కేవలం 95,039 క్వింటాళ్ల ధాన్యం కొన్నారు.

### సకాలంలో ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు...

యాసంగి సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడంతో ముందుగా వరి పంట కోసుకున్న రైతులు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి తీవ్రంగా నష్టపోయారు. యాసంగి కోతలు మొదలు కాగానే రైస్ మిల్లర్లు, అడ్తీ వ్యాపారులు రైతుల వద్దకెళ్లి కొనుగోళ్లు చేశారు. ఎక్కువమంది రైతులు రైస్‌మిల్లులకు తరలించారు. ప్రభుత్వ మద్ద తు ధర కంటే రూ.150 నుంచి రూ200 వరకు తక్కువ ధరకు విక్రయించారు. దీంతో కొందరు రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. సాగునీటి ఎద్దడితో అంతం త మాత్రంగా పండిన పంటకు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మద్దతు ధర రాక పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా పోయాయి. పదేండ్లలో ఏ సంవత్సరం కూడా ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కోలేదని, కొత్త ప్రభుత్వం రాగానే ఇలాంటి పరిస్థితి దాపురించాయని పలువురు రైతులు వాపోతున్నారు.

### గౌరవెల్లి రిజర్వాయర్‌పైనే రైతన్నల ఆశలు..

బీఆర్ఎస్ హయాంలో గౌరవెల్లి రిజర్వాయర్ పనులు 99శాతం పూర్తయ్యాయి. మూడు భారీ మోటర్లతో రిజర్వాయర్‌లో అర టీఎంసీ నీటిని నింపారు. పొలాలకు కాల్వల తవ్వకానికి భూసేకరణ సైతం పూర్తయింది. కాల్వల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.200కోట్ల నిధులు కేటాయించింది. కానీ కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేయడంతో రిజర్వాయర్‌లో నీళ్ల నింపే పనులు రద్దు అయ్యాయి. రిజర్వాయర్‌లో నీళ్లుంటే హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని వందలాది ఎకరాల్లో యాసంగి పంట ఎండిపోకుండా ఉండేది. కొత్త సర్కారు ఏర్పడ్డాక నీళ్లు పోయించడం గానీ, కాల్వల తవ్వకానికి శ్రీకారం చుట్టడం కానీ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ నింపి కాల్వల ద్వారా నీళ్లందితేనే పంటలు పుష్కలంగా పండుతాయని రైతులు అంటున్నారు. గౌరవెల్లిపైనే ఈ ప్రాంత రైతన్నలు కోటి ఆశలు పెట్టుకున్నారు.



బీఆర్ఎస్ సర్కారు హయాంలో మోటరుతో గౌరవెల్లి రిజర్వాయర్‌లో నీళ్లు నింపుతున్న దృశ్యం (ఫైల్)



సిద్దిపేట జిల్లాలో నిర్మాణం పూర్తయిన గౌరవెల్లి రిజర్వాయర్

# ఆహ్లాదం అందని ద్రాక్షేనా?

### హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణకు గ్రహణం



మధ్యలోనే ఆగిపోయిన ఎల్లమ్మ చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ పనులు



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకు బతుకమ్మ ఘాట్‌లో నిర్మించిన మెట్లు, స్టీల్ రేలింగ్

- నిధులున్నా ముందుకు సాగని పనులు
- 70శాతం పనులు పెండింగ్‌లోనే..
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులతోనే చెరువు కట్టకు కొత్తకళ
- మధ్యలోనే ఆగిపోయిన వాకింగ్‌ట్రాక్, రేలింగ్, చిల్డ్రన్స్ పార్కు పనులు
- మంత్రి పొన్నం దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

హుస్నాబాద్, మే 15: హుస్నాబాద్ పట్టణ ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అనేది కలగానే మిగులుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలోనే అతిపెద్ద చెరువైన ఎల్లమ్మ చెరువు సుందరీకరణ జరిగి అక్కడికి పిల్లలు, కుటుంబ సభ్యులతో సహా వెళ్లి ఆనందంగా గడపాలనుకునే పట్టణ ప్రజల కల నెరవేరేలా లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్ట మరమ్మతుతోపాటు సుందరీకరణ పనులు ప్రారంభమై కొన్ని పనులు పూర్తయ్యాయి. కొత్త ప్రభుత్వం రాగానే ఈ పనులకు గ్రహణం పట్టినట్లయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో కట్టకు మరమ్మతులు, పలు సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఇంకా 70శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా పనులు పూర్తిచేయడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్ మంత్రి అయినప్పటికీ నియోజకవర్గంలోని ప్రధానమైన అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి చేయాలని మంత్రిని కోరుతున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో రూ.10కోట్లు మంజూరు

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడంతోపాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో రూ.6.50 కోట్లతో కట్ట మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టారు. అనంతరం సుందరీకరణ పనుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మరో రూ.3.50 కోట్ల నిధులు విడుదల చేసింది. పనుల్లో భాగంగా చిల్డ్రన్స్ పార్కు, బోటింగ్, బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. బతుకమ్మ ఘాట్ పనులు పూర్తికాగా, వాకింగ్ ట్రాక్ పనులు సగం వరకే పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటుతున్నా చెరువు కట్ట పనులను పట్టించుకునే వారు కరువయ్యారు. అర టీఎంసీకి పైగా నీళ్లు నిల్వ ఉండే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు, చిల్డ్రన్స్ పార్కు, కట్టపై వాకింగ్ ట్రాక్, పూలమొక్కల పనులు పూర్తయితే పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆహ్లాదం దొరుకుతుంది. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.